

ఎన్నికల అధికారి కార్యాలయం వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రెండో సెట్ నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# జనగామ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఆశీర్వదిస్తే.. ఐదేళ్లు సేవకుడిగా ఉంటా
- ప్రగతి పనులను పరుగులు పెట్టిస్తా
- సీఎం కేసీఆర్ దీవెనలు.. ప్రజల ఆశీర్వాదం, పెద్దల సహకారంతో ఘన విజయం సాధిస్తా
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జనగామలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు
- హాజరైన మాజీ మంత్రి పొన్నాల, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు

జనగామ, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) :'ప్రజలు నన్ను ఆదరించి భారీ మెజార్టీ ఇచ్చి ఆశీర్వదిస్తే స్థానికంగా మీలో ఒకడినై ఉంటూ ప్రణాళికబద్ధంగా జనగామ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రగతి పనులను పరుగులు పెట్టిస్తా..' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, జనగామ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, నాయకులు బండ యాదగిరిరెడ్డితో కలిసి జనగామలో ఎన్నికల అధికారికి వేర్వేరుగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు వికాస్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో తొలుత ఆయన సోదరి సహా బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్లు అభ్యర్థి పల్లా నుదుట వీరతిలకం దిద్ది మంగళహారతులు పట్టారు. వేదపండితులు, వివిధ మతపెద్దల ఆశీర్వాదం, సర్వమత ప్రార్థనల అనంతరం గులాబీ శ్రేణులు బైక్ ర్యాలీగా ముందు నడవగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకొని ఉదయం 11.30 గంటలకు మొదటి సెట్, తర్వాత రెండోసెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పల్లా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనగామ నియోజకవర్గంలో ఇప్పటి వరకు చాలా అభివృద్ధి జరిగిందని, ఇంకా జరగాల్సిన పనులు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దీవెనలు..ప్రజల ఆశీర్వాదం, పెద్దల సహకారంతో జనగామలో ఘన విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాదనుకున్న జనగామ జిల్లాను ఇచ్చారు..రాదనుకున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ వచ్చింది..అద్భుతమైన సమీకృత కలెక్టరేట్ నిర్మించుకున్నాం.. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తా.. జనగామను అద్దంలా మారుస్తానని అన్నారు. ప్రజల సంపూర్ణ మద్దతు, ముఖ్యమంత్రి ఆశీస్సులు..వివిధ హోదాల్లో నాలుగు దశాబ్దాలుగా ఈప్రాంత అభివృద్ధిలో భాగస్వాములైన పొన్నాల, ముత్తిరెడ్డి, బోడకుంటి సహకారంతో కచ్చితంగా ఎమ్మెల్యేగా గెలుపొందుతానన్న విశ్వాసం, నమ్మకం ఉందన్నారు. ఎన్నికల కురుక్షేత్రంలో కూడా పెద్దల సలహాలు, సూచనలు తీసుకుంటానని, గెలిచిన తర్వాత కూడా నామినేషన్ వేసేందుకు వచ్చి ఆశీర్వదించి సహకరించిన వారి సూచనలు, సలహాలతో జనగామను తలమానికంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. 2001లోనే జనగామ నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో గులాబీజెండా ఎగిరిన గడ్డ..తెలంగాణ ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీకి అడ్డా..గులాబీజెండాకు ఇది డెన్ లాంటిదని ఆయన పేర్కొన్నారు. నాకు మాత్రం చాలా సంతోషం కలిగిందని..మా ముత్తిరెడ్డి అన్న నిండు మనస్సుతో ఆశీర్వదించిండు..మంత్రిగా జనగామకు సేవలందించిన పొన్నాల బలం తోడైంది బీఆర్ఎస్ గెలుపును ఇక ఎవరూ ఆపలేరు.. జనగామకు పెద్ద పాలేరునై పనిచేస్తా అని అన్నారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం..ఆయన పాలన పట్ల ప్రజలకు విశ్వాసం ఉందని, బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టినవి..పెట్టనవి కూడా అమలు చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ శాసనసభ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించి మూడో సారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని పల్లా అన్నారు. జనగామ నియోజకవర్గానికి కావాల్సిన సాగునీటిని మల్లన్నసాగర్, తపాస్‌పల్లి, బొమ్మకూరు రిజర్వాయర్ల ద్వారా ఇస్తున్నారని, ఎక్కడైతే పంట కాలువలు, చెక్‌డ్యాంలు, మినీ లిఫ్టులు కావాలో వాటన్నింటినీ తీసుకొచ్చి మీ ముందుంచే బాధ్యత నాది..బీఆర్ఎస్‌ను ఆదరించి అసెంబ్లీకి పంపిస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామకు మెడికల్‌తోపాటు నర్సింగ్ కాలేజీ, పారా మెడికల్ కాలేజీ, పాలిటెక్నిక్, వెటర్నరీ కాలేజీ సాధించుకోవాల్సి ఉందని, జనగామ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీళ్లు తాగించేందుకు చీటకోడూరు రిజర్వాయర్ సహా ఫిల్టర్‌బెడ్లను ఆధునీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీ అందరి ముందు వాగ్దానం చేస్తున్న సీఎం కేసీఆర్ వద్ద నుంచి అవసరమైన నిధులు తెచ్చి స్వచ్ఛమైన తాగునీటిని పట్టణ ప్రజలకు అందించడం తొలి ఎజెండా పెట్టుకుంటానని చెప్పారు. బాగా అభివృద్ధి చెందుతున్న జనగామకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రంగప్ప చెరువు అభివృద్ధి, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, డీసీపీ ఆఫీసు, స్పోర్ట్ స్టేడియం, కళాభవనం కావాలని, బచ్చన్నపేట, చేర్యాల, నర్మెటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ కావాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. జనగామ ప్రాంతంలో అత్యధికంగా పాల ఉత్పత్తి, రికార్డుస్థాయిలో ధాన్యం పండే ప్రాంతం జనగామ అని, ఫామాయిల్ పంటలు కూడా బాగా వేస్తున్నారని, సీతాఫలాలు, చింతగింజలు ఎక్కువ లభించే జనగామ యువత కోసం గ్రోత్ సెంటర్‌లో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పుకోవాల్సి ఉందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజన్ సహా చేర్యాలలో ఫైర్ స్టేషన్, మినీస్టేడియం, పట్టణాభివృద్ధి, పెద్ద చెరువు, కొమురవెల్లి మల్లన్న చెరువును అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ సరసన జనగామ అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

**కేసీఆర్ అంటే తెలంగాణ ఐకాన్ : ఎమ్మెల్యే ముత్తిరెడ్డి**

తెలంగాణ అంటేనే కేసీఆర్.. కేసీఆర్ అంటేనే తెలంగాణ అని జనగామ ఎమ్మెల్యే, టీఎస్ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఒకప్పుడు ఢిల్లీలో తెలంగాణ అంటే అదెక్కడుంటుంది అనే వాళ్లు.. కేసీఆర్ రాష్ట్రం సాధించిన తర్వాత పరిపాలన దక్షతతో దేశానికే ఐకాన్‌గా తెలంగాణను మార్చారు. ఒకనాడు బువ్వకు నోచుకోని.. జ్వరం వస్తేనో. .జేజెమ్మకు పెడితేనో తెల్లటి మెతుకులు దొరికేవి కానీ ఇప్పుడు భారతదేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగింది. జనగామ జిల్లా ఇచ్చి జిల్లా ఆకృతి తెచ్చి, మెడికల్ కాలేజీ మంజూరు చేసి నిండుగా నీళ్లు ఇచ్చిన ఫలితంగానే ఈప్రాంతం సస్యశ్యామలం అయ్యింది. నాటి జనగామ ఎట్లుండే..నేటి జనగామ ఎట్లా మారిందో మీ కండ్ల ముందున్నదన్నారు.

**కాంగ్రెస్ మోసపు మాటలు : ఎమ్మెల్యే రాజయ్య**

మన రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలను పక్కనున్న కర్ణాటకలో కాంగ్రెస్ ఎందుకు అమలు చేయడం లేదని రైతుబంధు సమితి చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు మీ పాలనకు కేసీఆర్ పాలనకు పొంతన ఉందా? ఉద్యమ సమయంలో ఊర్లు తిరిగిన సందర్భంలో రైతులకు రాత్రి కరెంటు అదీ కూడా ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి, లోవోల్టేజీతో మోటార్లు కాలి రైతులు ఆగమయ్యేది.. దుర్భిక్షానికి ట్యాగ్‌లైన్ మీ పాలన అని వారు ఎద్దేవా చేశారు.

## 'పల్లా' రెండు సెట్ల నామిషన్ పత్రాలు దాఖలు

జనగామ, నవంబర్ 07 (నమస్తే తెలంగాణ) : జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళికృష్ణకు అందజేశారు. వికాస్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో తొలుత సోదరి సరిత, ఆడబిడ్డ బింధు, భార్య నీలిమ సహా ఇతర కుటుంబ సభ్యులు పల్లా నొదుట విజయ తిలకం దిద్ది, మున్సిపల్ చైర్‌పర్సన్, మహిళా కౌన్సిలర్లు కలిసి మంగళహారతులు పట్టగా, సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటి ప్రధాన గుమ్మం వద్ద దిష్టి తీసి వాహనానికి గజమాల వేసి అక్కడి నుంచి గులాబీ శ్రేణులు బైక్ ర్యాలీగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకొని ఉదయం 11.30 గంటలకు మొదటి సెట్ నామినేషన్ వేశారు. తర్వాత రెండో సెట్ దాఖలు చేశారు.



జనగామ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ




సభ ఏర్పాట్లపై స్థానిక నాయకులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

## 10న మంత్రి ఎర్రబెల్లి రెండోసెట్ నామినేషన్

- హాజరుకానున్న మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్
- పాలకుర్తిలో భారీ బహిరంగ సభకు హాజరుకానున్న నేతలు

పాలకుర్తి రూరల్, నవంబర్ 7: బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ నెల 10వ తేదీన రెండోసెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ దాఖలు సందర్భంగా పాలకుర్తిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్ హాజరుకానున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో సభా స్థలిని మంత్రి ఎర్రబెల్లి మంగళవారం పరిశీలించారు. సభ ఏర్పాట్లపై బీఆర్ఎస్ నాయకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా నిర్వహించే సభకు రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు హాజరవుతారని చెప్పారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించే సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. ఈ కార్య ఎంపీపీ నల్లానాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మాజీ మార్కెట్ చైర్మన్లు ఎర్రబెల్లి రాఘవరావు, ముస్కు రాంబాబు ఉన్నారు.



మట్లాడుతున్న కడియం శ్రీహరి, చిత్రంలో బొల్లపల్లి కృష్ణ, నాయకులు

## కాంగ్రెస్‌కు డాక్టర్ బొల్లపల్లి కృష్ణ రాజీనామా

**బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి**

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి నవంబర్ 7: రఘునాథపల్లి మండలం కోమల్లకు టీ–పీసీసీ వైద్య విభాగం సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొల్లపల్లి కృష్ణ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడినా ఈ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి టికెట్ ఇవ్వకపోవడంతో ఆవేదన చెందిన ఆయన అధిష్టానం వైఖరికి నిరసనగా కాంగ్రెస్‌ను వీడారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి కోమల్లలోని బొల్లపల్లి కృష్ణను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ చిన్నవయసులోనే కాంగ్రెస్‌లో చేరి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న కృష్ణను అధిష్టానం గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ కోసం ఆశించిన వ్యక్తిని ఆదరించలేదన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో మీకు మంచి భవిష్యత్ ఉంటుందని బొల్లపల్లి కృష్ణను ఆయన ఆహ్వానించగా, సానుకూలంగా స్పందించారు. త్వరలోనే కృష్ణ బీఆర్ఎస్‌లో చేరుతారని సమాచారం. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్‌యాదవ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మారుజోడు రాంబాబు, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, సర్పంచ్ మంజుల, నాయకులు ఎర్రోళ్ల కుమార్‌గౌడ్, నామాల బుచ్చయ్య, తాటికొండ వినయ్‌కుమార్, గైని శ్రీనివాస్, తాటి కొండ యాదగిరి, హుస్సేన్‌నాయక్, మడ్లపల్లి సునీత–రాజు, దొనికెల రమాదేవి, తిప్పారపు రమ్య, తిరుపతి, చెంచు రమేశ్, అన్నం బ్రహ్మారెడ్డి, బండి యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

## బంగారు పద్మాలతో బుగులు వెంకన్నకు పూజలు



ఆలయంలో స్వామివారు

చిల్పూరు, నవంబర్ 7 : మండల కేంద్రంలోని శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అష్టాదశ పాద పద్మారాధన పూజలను అర్చకులు నిర్వహించారు. తిరుపతిలో మాదిరిగా 108 బంగారు పద్మాలతో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఈవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ అష్టాదశ పాద పద్మారాధన పూజ ప్రతి నెలలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత మాజీ దేవస్థాన డైరెక్టర్ సంగోజు లక్ష్మీమోహన్ దంపతులు, ధర్మకర్తలు కుంచాల సంపత్‌రాజ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.